రెడ్డిగారి భవంతి వచ్చే పోయే జనంతో కోలాహలంగా ఉంది. పైరవీలకు, పంచాయితీలకు, తీర్మానాలకు ఆ ఇల్లు ఒక వేదిక. సూర్యోదయంతో వచ్చిన మోతీ అలాగే గేటు పిల్లర్‌కు ఆనుకుని కూర్చుంది.

మోతీ ముఖంలో నిరాశలు గూడు కట్టుకుని ఉన్నాయి. ముడుతలు పడ్డ ముఖం... జీవితంలోని కష్టాలకు గుర్తుగా. నొసలుపై అడ్డంగా ఉన్నాయి.

కళ్ళల్లో ఏవో ఆశలు మిణుగురు పురుగుల్లా వెలుగుతున్నాయి.

కొడుకు రావుడు హత్య చేశాడని న్యాయస్థానం రుజువు చేసింది. అంతే కాకుండా, అతనికి ఉరిశిక్ష కూడా విధించింది. ఆ ఆలోచనలతో మోతీ గుండెలు బరువెక్కుతున్నాయి. కొడుకు లేని తన చివరి జీవితాన్ని ఊహించుకోలేక పోతూంది.

కోర్టులో వకీళ్ళతో ఇక లాభం లేదని, రాష్ట్రపతికి క్షమాభిక్ష కోసం రాజారెడ్డి గారైన ఆ ప్రాంతం ఎమ్. ఎల్. ఎ. గారిని ఆశ్రయించింది.

వారి దర్శనం కోసం ఎదురు చూస్తూంది. దాని కోసం రెండేళ్ళ నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. తన కున్న అయిదు ఎకరాల మెట్ట పొలం అమ్మి ఎమ్. ఎల్. ఎ. గారి దోసిట్లో పోసింది. కాని అనుకున్నంత ఫలితం కనబడ్డం లేదు.

ఉరి తీసే గడువు సమీపిస్తూంది. మృత్యుకుహరంలోకి ప్రవేశించనున్న కొడుకు జీవితాన్ని తలుచుకుని ఎంత గానో ఏడుస్తూంది. భరించలేని బాధ గుండెని పిండేస్తూంటే, రెండేళ్ళ నుండి కంటికి నిద్ర లేదు. కాలికి నిలకడ లేదు.



# బోయ జంగయ్య ✦ పనిష్మెంట్

భర్త పోయాడన్న బాధ, కొడుకు చస్తాడన్న వ్యథ మోతీని క్రుంగతీస్తున్నాయి.

ఇంతలో రాజారెడ్డిగారు పెళ్ళి పీటల మీది కెళ్ళే పెండ్లి కొడుకులా వరండా లోకి వచ్చారు. పెదవులపై చిరునవ్వులు తొణికిస లాడుతున్నాయి. తెల్లని ఖద్దరు దోవతి, సిల్కులాల్చీ అతని హుందాతనాన్ని చాటుతున్నాయి.

రాజారెడ్డిని చూడగానే దేవుణ్ణి చూసినంత పనయింది మోతీకి.

అంతవరకు ఆపుకున్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది.

"దొరా! ఖర్చులకు భయపడకండి! మిగిలిన ఆ చెలక గడ్డైనా అమ్మి నా కొడుకు ప్రాణాలు నిలబెట్టండి. ఎలాగైనా వాడు బ్రతకాలి" అంటూ తన నిశ్చయాన్ని వెలిబుచ్చింది.

కేసును ఆలోచిస్తూ సిగారు వెలిగించాడు ప్రజానాయకుడు.

మోతీ ఇంకా తన గోడు వెళ్ళబోస్తూనే ఉంది. "వాని శని మూడింది. వాడి తండ్రిని వాడే చంపుకున్నాడు. మంది నేమైనా చంపాడా?" అంటూ "లా" కు దొరకని పాయింటుతో ఏడుస్తూ మాట్లాడుతూంది.

అది విన్న రాజారెడ్డి, "తను చావడానికి కూడా చట్టం ఒప్పుకోదు. అది హత్యయినా, ఆత్మహత్యయినా నేరం నేరమే. శిక్ష తప్పదు" అన్నాడు.

"చచ్చిన ముసలోడు ఎలాగో చచ్చిపోయె! కనీసం వీడన్నా బ్రతకాలి గదా! వాడి పెళ్ళాం ఏడ్చి, ఏడ్చి సగం అయింది. అత్తగారోళ్ళు కూడా కొంత డబ్బిస్తమంట్రు ఏదన్నా చేసినా కొడుకు ప్రాణం కాపాడు దొరా! నీ ఆకలి ఉంకి నీ ఋణం, తీర్చుకుంట" అంటూ మోతీ వెక్కి వెక్కి ఏడుస్తూంది.

అప్పుడే అక్కడి కొస్తున్న కోడల్ని చూపిస్తూ — "అదిగో, అదికూడా ఏడుస్తూంది—దాని ముఖం చూడు, దొరా!

అది కుమిలి, కుమిలి ఏడ్చి చస్తూంది. అది కాపురానికొచ్చి కొద్ది రోజులైనా కాలేదు. వాడేమో జైలు పాలయ్యిండు. ఆనాటినుంచి దాని కంటికి నిద్ర కూడా లేదు. దాని ముఖం చూసైనా సరే, వాని ప్రాణం కాపాడండి."

నేలను చూస్తూ ఏడుస్తున్న కోడలు లచ్చిమి దగ్గిర కెళ్ళి తల నిమురుతూ, "ఊర్కో — ఊర్కో —దొర ఎలాగైనా నీ పసుపు కుంకుమ కాపాడతాడు—ఏడవకు' అంటూ వోదార్చింది.

రాజారెడ్డి ఇద్దరినీ చూస్తున్నాడు. ఇంత చిన్న వయసులో వచ్చిన ఆపదను ఆలోచిస్తూ సిగార్ దమ్ము లాగి, పొగను గాలిలోకి వదిలాడు.

"ఇంకా ప్రయత్నం చేద్దాం— ఈసారి ముఖ్యమంత్రి గారిని కలుద్దాం. ఆయన ద్వారా ఢిల్లీకి ఫోను చేయిద్దాం. ఈసారి తప్పకుండా అవుతుంది."

రాజారెడ్డి మాటలకు మోతీ ప్రాణాలు లేచొచ్చాయి.

కోడలు కళ్ళలో కొత్త కాంతులు వెలిగాయి.

మోతీ రెడ్డి కాళ్ళకు మొక్కుతూంది.

కోడలు లచ్చిమి ఏడుస్తూంది.

లచ్చిమికి పాతికేండ్లు. పసుపు పచ్చ రంగు...నల్లని కళ్ళు. రెడ్డి చూపులు తడబడ్డాయి.

మనసులో ఏదో కదిలింది.

సిగారును నేలకేసి విసిరి, మోతీని దగ్గిరికి పిలిచి చెవిలో ఏదో చెప్పాడు.

"అమ్మో! ఎద్దు, దొరా" అంటూ నోరు మూసుకుంది. మళ్ళీ చెప్పాడు రెడ్డి.

"అమ్మో! అది నాతో కాని పని, దొరా!" అంటున్న మోతీకి వణుకు లాంటిది మొదలయింది.

రాజారెడ్డి పెదాలపై ఒకవిధమైన నవ్వు నాట్యం చేసింది.

"ఇది మాత్రం నాతో అయ్యే పనా?"

ఆ మాటలకు మోతీ కొంతసేపు రాయిలా నిలబడింది.

"అప్పడిగి డబ్బులు తీసుకుని వస్తా!" అంటూ కోడలితో వెళ్ళి పోయింది.

దారిలో లచ్చిమికి రెడ్డిగారు తన చెవిలో చెప్పిన రహస్యాన్ని కోడలు చెవిన వేసింది.

అది విన్న లచ్చిమి బొమ్మలా నిలబడింది. అలా నిలబడ్డ లచ్చిమి కళ్ళ నుండి ఏకధారగా కన్నీరు జారుతూంది.

"ఆయన ఎలాగూ చస్తాడు, నేనూ చస్తాను. కానీ ఈ పని చేయలేను."

"ఎవ్వరూ చావకూడదు. ఇద్దరూ బతకాలి — అందుకే."

"ఎట్లా బతికేది? ఏం చేసేది? ఆ తరవాత ఈ ముఖం ఎట్లా చూపేది? ఈ కుంపటిని ఎట్లా భరించేది?"

"బతకాలి— భరించాలి—నా భర్తను నీ భర్త చంపినా, నేను కోర్టులో చంపలేదని సాక్ష్యం ఇవ్వలేదా?"

"ఆయన మాత్రం చంపాలని చంపాడా? ఏదో చిన్న మాట వివాద మాట పెరిగి పెద్ద జగడమైంది."

"ఏది ఏమైనా చంపిండా లేదా? కోర్టులో అబద్ధం చెప్పిన్నా లేదా?"

అది నీ కడుపు తీపి. అయినా నాకు చెప్ప నీకు నోరెలా వచ్చింది?"

"ఆ...ఆ కడుపు తీపే... ఆ నోరే... అదే నా భర్తను చంపినా చంపలే దన్నదే... ఆ నోరే ఈ రోజు చెప్పేది."

"ఆవు, అత్తా... ఆవు" అంటూ లచ్చిమి ఏడుస్తూంది. మోతీ ఏడుస్తూంది.

"కానీ...కానీ... ఒక్కసారి ఆయనను చూసొచ్చాకా..."

"ఎందుకు ...ఈ విషయం వాడితో చెపుతావా ఏం?"

"లేదు! ఆయన్ని చూసి రావాలి! అంతే."

* * *

జైల్లో విజిటర్స్ గది ...

గది బయట జవాను.

గదిలో రావుడు, లచ్చిమి. చుట్టూరా భయంకర నిశ్శబ్దం. ఇద్దరి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

"అత్త రెడ్డి గారితో మాట్లాడింది" అంటూ లచ్చిమి కళ్ళనీళ్ళు కార్చడం మొదలు పెట్టింది.

"ఏ మన్నాడు?" రావుడు.

"తప్పక ఇడిపిస్తానన్నాడు... కనీ..."

"డబ్బులు కావలన్నాడా?"

"చెలకనమ్మి డబ్బులు ఇస్తామన్నాం కాని..."

"మరి ?....."

"........."

"చెప్పవేం?"

ఎలా చెబుతుంది? ఏమని చెబుతుంది?

ఏడ్వటం తప్ప... ఏం చెప్పలేక పోతూంది.

"చలో ... చలో ... టైమ్ హోగయా..." జైలు జవాను విదిలింపు.

"ఏ దడిగినా ఇవ్వండి. ఎం తడిగినా ఇవ్వండి. చెలక... బావి... అన్నీ....."

"క దు... అవేవీ కావు..." చెప్పలేక పోతూంది. కడుపులో కదిలిన దుఃఖం కనురెప్పలను తన్నుకొస్తూంది.

"ఏ దడిగిన ఇవ్వండి... నేను బ్రతకాలి."

"చలో... చలో... బాహర్ చలో..."

రావుడు జైల్లోకి, లచ్చిమి బయటికి నడిచారు.

* * *

పట్టణంలో అధునాతనమైన హోటల్ గది. చాలా అందంగా, విశాలంగా ఉంది. మెత్తని డబల్ బెడ్ పై తెల్లని బెడ్‌షీట్ పాలనురగలా ఉంది. లచ్చిమి వలలో చిక్కుకున్న లేడిలా బెదురు బెదురుగా అదే బెడ్ పై కూర్చుంది.

ఎదుటి సోఫాలో కూర్చున్న రాజారెడ్డి కాలుతున్న సిగరెట్టును యాష్ ట్రేలో నలిపి వదిలి, వెళ్ళి లచ్చిమి పక్కన కూర్చుంటూ—"లచ్చీ!" విరిసిన పూవులా ఉన్నావే..." అంటూ లచ్చిమి దగ్గిరికి జరిగి కూర్చున్నాడు.

లచ్చిమి గుండె వేగం హెచ్చినట్లయింది. రెండు చేతులతో తన గుండెను అదిమి పట్టుకుంది భయంతో.

కళ్ళలో భయం, చూపులో బెదురు, శ్వాసలో బాధ, ఒంటిలో వణుకు.

ఆమె మనసులో అత్త, భర్త రూపాలు కదిలాయి.

"ఎవ్వరూ... చావకూడదు." అత్త.

"నేను బతకాలి — అంతే." భర్త.

బాధగా తలెత్తి చూసింది.

ట్యూబ్‌లైట్ దగ్గర ఎగురుతున్న ఒక చిన్న మిడతను నక్కి పొంచి ఉన్న బల్లి నోట కరిచి పట్టింది.

కసిగా ఆయన లచ్చిమిని తన కౌగిట్లో అదిమిపట్టాడు. బల్లినోటిలో ఉన్న మిడత గిలగిల తన్నుకొంటూంది. అతని కౌగిలిలో ఆమె భయంగా, బాధగా శ్వాస వదులుతూంది.

బల్లి మిడతను చిదిమి చిదిమి మ్రింగింది.

అతి దారుణంగా ఆ రాత్రి గడిచింది.

* * *

వారం గడిచాక ఒక ఉదయం రావుడిని ఉరి తీశారు. ఆ వార్త విన్న మోతీ ఏడ్చి, ఏడ్చి మూగదయింది. లచ్చిమి మాత్రం ఏడవడం లేదు. నవ్వుతూ ఉంది.

* * *

కొన్నాళ్ళ తరవాత మళ్ళీ ఎన్నికలొచ్చాయి. తండాలోని గిరిజనులను ఉద్దేశిస్తూ రెడ్డి అన్నాడు: "నేను రావుడికి ఉరి శిక్షను తప్పించాలని హైదరాబాదు, అంతేకాదు, ఢిల్లీకి తిరిగి తిరిగి ఎంత ప్రయత్నించినా ఫలించలేదన్న విషయం మీ అందరికీ తెలుసు." ✱